ప్రజాశక్తి

శనివారం 30 డిసెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల


నోటిలో గుడ్డలు కుక్కి..

వృద్ధురాలిపై సామూహిక అత్యాచారం.!

ప్రజాశక్తి-మార్కాపురం

ఒంటరిగా ఇంటిలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై కొందరు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన మార్కాపురం మండంలోని రాయవరం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. సామూహిక అత్యాచారానికి గురైన వృద్ధురాలి పరిస్థితి విషమించడంతో మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు.

రైల్వేస్టేషన్ సమీపంలో నివాసముంటున్న వృద్ధురాలి భర్త గతంలో చనిపోయాడు. కేవలం పింఛను సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. నివాసం ఉండేందుకు ఇల్లు తప్ప మరేమీ లేదు. ఆమె కుమార్తె, అల్లుడు కూడా అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తున్న విషయం అదే ప్రాంతానికి చెందిన యువకులు గమనించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో నలుగురు యువకులు ఆమె నోటిలో గుడ్డలు కుక్కినట్లు తెలిసింది. దీంతో ఆమె కేకలు వేయలేకపోయింది. తాళ్లతో బంధించి యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఆ వృద్ధురాలు తనపై జరిగిన దారుణాన్ని సమీపంలోని కుమార్తెకు ఆవేదనతో చెప్పుకుంది. వృద్ధురాలిని మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చేర్పించారు. ఈ విషయంపై మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరనాయక్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా జరిగిన ఘటన తెలిసిందని, విచారిస్తున్నామని చెప్పారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్

ఉన్నత చదువులకు అండగా ప్రభుత్వం

కలెక్టర్ దినేష్‌కుమార్

3లో ▲

వైసిపి అభ్యర్థుల ఎంపికలో

తుది దశకు కసరత్తు

- భారీ మార్పుల దిశగా వ్యూహాలు
- ఒంగోలు, గిద్దలూరుపైనే తర్జనభర్జన
- తదుపరి జాబితాపై నేతల్లో ఉత్కంఠ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి అభ్యర్థుల కసరత్తు తుదిదశకు చేరింది. విడుదలపైనే ఉత్కంఠ కొనసాగుతోంది. శుక్రవారం నాడు జాబితా విడుదల చేస్తారని బాలినేని గురువారం నాడు సిఎం జగన్‌ను కలిశాక మీడియాకు చెప్పారు. అయితే జాబితా విడుదలలో కొంత జాప్యం జరిగేలా కనిపిస్తోంది. ఒకటీరెండు స్థానాలపై ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నాయి. విజయవాడలో నేతల మధ్య ఉత్కంఠ చర్చలు నడుస్తూనే ఉన్నాయి. ఎవరెక్కడ అనే దానిపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టతకు రాలేకపోతున్నారు. వ్యూహప్రతివ్యూహాలు వాడివేడిగా సాగుతున్నాయి. చివరి నిమిషం వరకూ మార్పులపైనే తర్జనభర్జనలు పడుతున్నారు.

ఎవరికి ఎక్కడ పెడితే గెలుపు సులువవుతుందన్నదే ప్రధాన ఎజెండాగా కూర్పులు జరుగుతున్నాయి. ఒక వైపు సర్వే నివేదికలు.. మరో వైపు నేతల రాజకీయంగా సీనియారిటీతో పాటు సామాజిక అంశాలు, ఆర్థిక పరిపుష్టత, ప్రజల్లో ఆదరణ, ఓటర్లను ఆకర్షించే తత్వం వంటి అంశాలను అన్ని కోణాల్లో



విశ్లేషణలు సాగుతున్నాయి. కసరత్తు సాగిస్తున్నారు. జిల్లా నేతలతో కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఈ పాటికే సుదీర్ఘంగా చర్చలు జరిపారు. బాలినేనితోనూ భేటీ అయ్యారు. టిక్కెట్లు ఆశించే నేతలందరూ కలిశారు. తాడేపల్లికి క్యూ కట్టారు. అయితే కసరత్తు చివరి దశకు చేరింది. ఒకటీరెండు నియోజకవర్గాలలో అభ్యర్థులపై స్పస్టత రావాల్సి ఉంది. ఇదంతా ఇప్పుడు సీనియర్ నేత బాలినేని నిర్ణయంపైనే ఆధారపడింది. ఒంగోలు, గిద్దలూరూ ఈ రెండు నియోజకవర్గాలపైనే ఇప్పుడు చర్చంతా.. తాను ఒంగోలు నుంచే పోటీ చేస్తానని చెప్పిన బాలినేని మనసులో గిద్దలూరు కూడా ఉందని తెలుస్తోంది. అధిష్టానం నిర్ణయిస్తే అక్కడకు వెళతారా? లేక ఒంగోలులోనే పోటీ చేస్తారా? అనేదీ జాబితా ప్రకటించే వరకూ తేలేలా కనిపించడం లేదు. చాలా రోజులుగా బాలినేని గిద్దలూరుపైనా దృష్టి సారించారనే చర్చ ఉన్నా ఆయన మాత్రం దాన్ని అంగీకరించలేదు. అయితే తుది దశలో మారింది. ఆయన ఇప్పుడు గిద్దలూరు నుంచే బరిలో దిగే అవకాశాలున్నాయి. అయితే ఒంగోలులో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపే బాధ్యత కూడా బాలినేనిపైనే ఉంది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పశ్చిమాన పోటీలో ఉంటారని భావించినా ఆయన పేరు ఒంగోలుకు కూడా వినిపిస్తోంది. ఒంగోలులో పోటీ చేయాలని అధిష్టానం సూచించింది. బాలినేని కూడా ఇదే విషయంపై శిద్దాను ఒప్పించే యత్నం చేశారని వినికిడి. తుది నిర్ణయంపై మాజీమంత్రి శిద్దా రాఘవరావు తర్జనభర్జనలో పడ్డారు. ఎటూ తేల్చలేకపోతున్నారు. అయితే శిద్దా గతంలో తెలుగుదేశం నుంచి బాలినేనిపైనే ఒంగోలులో పోటీ చేశారు. అప్పటి అనుభవాల రీత్యా ఇక్కడ పోటీకి సముఖంగా లేరని తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాలపై అవగాహనకు వచ్చాకే జాబితాలోకి పేర్లు చోటుచేసుకుంటాయి. ఇక మిగతా స్థానాలపై పెద్దగా చర్చలు కనిపించడం లేదు. కనిగిరి, మార్కాపురం, దర్శి, వైపాలెం నియోజకవర్గాల్లో అభ్యర్థులపై అవగాహనకు వచ్చేశారు. అక్కడ ఈ పాటికే చర్చలో ఉన్న నేతలే అభ్యర్థులుగా ఖరారవ్వనున్నారు. ఏదేమైనా అభ్యర్థులపై పాలకపక్షంలో ఇప్పటికీ ఉత్కంఠ తప్పడం లేదు.

పోరు..నిరసనల హోరు

- కొనసాగుతున్న సమ్మెలు
- 18వ రోజుకు చేరిన అంగన్‌వాడీల ఉద్యమం
- మెడకు ఉరేసుకున్నట్లు.. మున్సిపల్ ఉద్యోగుల నిరసన
- కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న సర్వ శిక్ష ఉద్యోగుల దీక్షలు



ఒంగోలులో ఉరేసుకున్నట్లు.. నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నిర్విరామంగా కొనసాగుతోంది. వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఉద్యోగుల ఆందోళనలపై కనీసం దృష్టి కూడా పెట్టలేదు. ఎన్నికల వ్యవహారాలపై వాడివేడిగా సాగుతున్న భేటీల్లోనైనా ఇవి చర్చకు రాకపోవడం విడ్డూరంగా ఉంది. కనీసం ప్రజల గురించి కూడా ఆలోచించడం లేదు. సమ్మె కొనసాగుతున్న రంగాల్లో ప్రభుత్వపరమైన కార్యకలాపాలు, ప్రజలకు అందించే సేవలు స్తంభించిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదు. సమ్మె పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదు. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు కోసం ఇప్పుడు వీళ్లంతా సమ్మెలు చేస్తున్న సంగతి తెలిసిందే.. ఇప్పటి వరకూ పలుసార్లు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. దీంతో అనివార్యంగా సమ్మెలోకి వెళ్లారు. అంగన్‌వాడీలు సమ్మె చేపట్టి రెండు వారాలు దాటింది. శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరింది. అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలూ మూతపడ్డాయి. పిల్లల తల్లిదండ్రులు కూడా సంఘీభావంగానే ఉన్నారు. శుక్రవారం నాడు అంగన్‌వాడీలు అన్ని కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. పార్టీలు, ఉద్యోగ సంఘ నేతలు పలుచోట్ల మద్దతుగా పాల్గొన్నారు. పొదిలిలో యుటిఎఫ్ రాష్ట్ర నేత మీగడ వెంకటేశ్వరెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఒంగోలులో అన్ని కార్మిక సంఘాలు, రైతుసంఘాల నేతలు మద్దతుగా పాల్గొన్నారు. జాతీయ రైతుసంఘాల సమన్వయ సమితి నేత చుండూరి రంగారావు శిబిరంలో మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇక మున్సిపల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నాలుగో రోజూ విజయవంతంగా సాగింది. అన్ని కార్యకలాపాలూ నిలిచిపోయాయి. ఒంగోలులో ధర్నా శిబిరంలో మెడకు ఉరితాడు వేసుకొని ఉద్యోగులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉద్యోగుల సమ్మె వల్ల పట్టణాల్లో అన్ని కార్యకలాపాలూ నిలిచినా రాష్ట్రప్రభుత్వం స్పందించక పోవడం చర్చగా మారింది. చెత్త సేకరణ ఆగిపోయింది. బలవంతంగా వాహనాలను నడిపించే యత్నం చేయగా ఉద్యోగులు అడ్డుకున్నారు. ధర్నా చేపట్టారు. సమ్మె పరిష్కారం కన్నా విచ్ఛిన్నం చేసే చర్యలే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సమ్మెపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బాపట్లలో..

చిటికెలు వేస్తూ..

- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె
- గ్రామపంచాయతీ వర్కర్లు, సిఐటియు నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరుకుంది. శుక్రవారం వినూత్న రీతిలో చిటికెలు వేస్తూ.. అంగన్వాడీలు తమ నిరసన తెలిపారు. సమ్మెకు సంఘీభావంగా వర్కర్లు, సిఐటియు నాయకులు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుండి సిడిపిఓ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వరకు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి సిఐటియు నాయకులు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్ సంఘీభావం గా మాట్లాడుతూ 18 రోజులుగా జరుగుతున్న అంగన్వాడి సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సంఘీభావం తెలిపిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వసంతరావు, ఐఎల్‌టిడి చీరాల బ్రాంచ్ కార్యదర్శి సుధీర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు తిరుమల రెడ్డి, బి.బుచ్చిరాజు, బ్రహ్మయ్య, శేఖర్, అంగన్వాడీల నియోజకవర్గ నాయకురాలు శైలశ్రీ, హేమమాలిని, గీతా, లత, కుమారి పాల్గొన్నారు.



ఒంగోలులో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

నిర్లక్ష్యంగా ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ▶ 2లో

చిటికెలు వేస్తూ..

(మొదటిపేజీ తరువాయి)

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఒంగోలు ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజుకి చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా నాయకులు కెవి సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. రిలే దీక్షలను ప్రారంభించిన ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమీషాలు లెక్కిస్తోందన్నారు. వేలాదిమంది రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ ప్రాజెక్టు కేంద్రాలు, మండల కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ల వద్ద రిలే దీక్షలు, ఆందోళన చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. కేంద్ర కార్మిక సంఘాలు సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు సంఘాలు జిల్లా నాయకులు అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం ఏఐటియుసి జిల్లా కార్యాలయం నుండి హెడ్ పోస్టాఫీస్, చర్చి సెంటర్, కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టిన అంగన్‌వాడీలకు సంఘీభావం ప్రకటించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐటిసియు జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 18 రోజుల నుండి అంగన్‌వాడీ వర్కర్లు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తుందన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. సమ్మెలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు జివి సుజాత, డైరీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరావు, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి తంగిరాల మహేష్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసులు, జి.రమేష్, యూనియన్ నాయకులు ఎ.ప్రశాంతి, హేమీమా, సిహెచ్ జ్యోతి, సంధ్యారాణి, పద్మ, నిర్మల, ఉమా శేషమ్మ, మహాలక్ష్మి, కె. శ్రీదేవి, గౌసియా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



కందుల నారాయణరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరినవారు

పది కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్ల ఎస్సీ కాలనీకి సంబంధించిన పది కుటుంబాల వారు వైసిపిని వీడి మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపిలో చేరారు. స్థానిక చర్చిలో ఎస్సీ కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన సాగిస్తోందని అన్నారు. అవినీతి అక్రమాలు పెచ్చరిల్లాయని, ఎస్సీలకు రక్షణ కరువైందని అన్నారు. అందులో ఇమడలేకనే టిడిపిలో చేరుతున్నామని తెలిపారు. అనంతరం వైసీపీ నుంచి టిడిపిలో చేరిన వంగేవరపు గురవయ్య, ప్రసాద్, మరో పది కుటుంబాల వారికి కందుల నారాయణరెడ్డి, టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మోరబోయిన బాబురావు, పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్ సప్పిడి రామలింగయ్య, మండల పార్టీ మాజీ కన్వీనర్లు కనకం నరసింహారావు, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొనకనిమిట్ల గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో ఈ నెల 6,7,8,9 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జనసేన రాష్ట్ర నాయకులు వైదన నాగబాబు, దర్శి నాయకులు గరికపాటి వెంకట్‌లు ఆవిష్కరించారు. గరిగపాటి వెంకట్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఎడ్ల బలప్రదర్శన దర్శిలో జరుగుతుందని, దానిని జయప్రదం చేయాలని కోరారు.

ఖాదర్‌బాషాకు డాక్టరేట్

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండకు చెందిన రిటైర్డ్ రైల్వే టికెట్ కలెక్టర్, రిటైర్డ్ హెచ్‌ఎం ఖాదర్‌బీల రెండో కుమారుడు షేక్ ఖాదర్‌బాషా విజయవాడ కెఎల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. రైతుల జ్ఞానం, వ్యవసాయాన్ని స్వీకరించటం మధ్య ఉన్న సంబంధాలపై రైతుల వైఖరి, అవగాహన యొక్క మధ్యవర్తిత్వ ప్రభావాన్ని విశ్లేషించటం, మెరుగైన మార్కెటింగ్ పద్ధతుల కోసం ఎంపిక చేసిన పంటల ఇన్‌పుట్‌లపై ప్రకాశం జిల్లాలోని కరువు ప్రాంతాల్లో పరిశోధనలు చేసినందుకు వ్యవసాయంలో డాక్టరేట్ వరించింది. ఈ మేరకు కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె పార్థసారథి చేతుల మీదుగా డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందిన ఖాదర్‌బాషాను కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న ఖాదర్‌బాషా



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

విత్తనోత్పత్తిపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

రైతులు విత్తనోత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ సీడ్ కార్పొరేషన్ భారత ప్రభుత్వ విత్తనోత్పత్తి సంస్థ వారు కోరారు. ఈ మేరకు దర్శిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ విత్తన చట్టాలు, విత్తన విక్రయాలకు సంబంధించి లైసెన్సును కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వరరెడ్డి, ఉషా, శివతో పాటు ఏరియా మేనేజర్ శ్రీనివాస్, రామ్‌ప్రభువు పాల్గొన్నారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.8.5 లక్షలు

ప్రజాశక్తి-సిఎస్ పురం

ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోన హుండీ ఆదాయం రూ.8,53,538 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం భైరవకోనలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జిఎ సత్యనారాయణ, ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, సిద్దు వెంకట్‌రెడ్డి, ఆలయ ఇఓ నారాయణరెడ్డి సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. హుండీ ద్వారా రూ.4,27,673, కార్తీక మాసం టిక్కెట్ల ద్వారా రూ.4,25,865 వచ్చినట్లు తెలిపారు. గతంలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడాది కార్తీక మాసంలో అధిక ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ముడుమాల నారాయణరెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన బొట్ల శ్రీనివాసులు(28) రెస్టారెంట్‌లో పనిచేస్తూ ప్రతి రోజూ మద్యం తాగేవాడు. ఈ నెల 27వ తేదీన పనికి వెళ్లకుండా మద్యం తాగి ఇంటి వద్ద ఉన్నాడు. అదే విధంగా 28వ తేదీ కూడా 12గంటల సమయంలో మద్యం మత్తులో పురుగు మందు తాగి ఉన్నాడు. అక్కడ డబ్బా ఉండటంతో బంధువులు చూసి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాళ్లూరు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కాంప్లెక్స్ గురించి ఉపాధ్యాయులకు వివరిస్తున్న ఎంఇఒ-2 కొండారెడ్డి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి: ఎంఇఒ-2

ప్రజాశక్తి-సిఎస్ పురం

ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయినిబట్టి వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఎంఈఒ-2 రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాథమిక స్థాయి సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ యొక్క ప్రాధాన్యత గురించి ఉపాధ్యాయులకు వివరించారు. అలాగే పిల్లలకు ఏ విధంగా విద్యా బోధన చేయాలి అనేదానిపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరు న్నీసాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామివారికి 'శిద్దా' పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు ప్రసన్న చెన్న కేశవ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన స్వామి వారి గరుడ సేవ ఉత్సవంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు క్షేత్రంలో వేంచేసి ఉన్న స్వామి వారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించి, సమ్మెలను విరమింపజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో జరిగిన సిపిఎం మండల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనీఫ్ మాట్లాడుతూ ఈ నెల 12 నుండి అంగనవాడీలు, 20 నుంచి సర్వ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, 26 నుంచి మున్సిపల్ కార్మికులు వారి న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ఉన్నారన్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభకు పల్లాపల్లిఆంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, మండల కమిటీ సభ్యులు క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, తొట్టెంపూడి రామారావు, బెజవాడ శ్రీను, కొల్లూరి వెంకటేశ్వర్లు, కుమ్మిత శ్రీనివాసులడ్డి, శీలం ఆదినారాయణ, బొడ్డు ఓబులేషు, బొజ్జా వీరాంజనేయులు, చిట్టేల కొండయ్య, పులి ఓబులరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అండగా ప్రభుత్వం

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేద కుటుంబాలలోని పిల్లలు ఉన్నత చదువులు చదివేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 'జగనన్న విద్యా దీవెన' పదకంలో భాగంగా అర్హులైన విద్యార్థులు, తల్లుల సంయుక్త ఖాతాలలో నాలుగో విడత నిధులు జమ చేస్తున్న సందర్భంగా శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా ప్రకాశం భవనంలో నిర్వహిం చిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కు అందజేశారు.

పురుగు మందు తాగి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

పురుగుల మందు తాగి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం నాడు శింగరాయకొండ మండలం కనుమళ్ల జామాయిల్ తోటలోజరిగింది. ఎస్సై టి శ్రీరామ్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తికి 70 సంవత్సరాలు ఉంటాయని, అయితే పురుగులు మందు తాగి జామాయిల్ తోటలో మతి చెందాడని పోలీసులు తెలిపారు. అతను దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, రూ.1500 నగదు ఉందని వివరించారు. అయితే అతను రైతులాగే ఉన్నారని దీనిపై విచారణ చేస్తున్నామని వివరించారు. ఎస్‌ఐ వెంట ఏఎస్‌ఐ మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్


దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

నగరంలో చలికి వణుకుతున్న సుమారు యాభై మంది బిక్షగాళ్లకు గురువారం అర్ధరాత్రి మాజీ కౌన్సిలర్ అనంత మల్లి ఖార్జునరావు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సాయిబాబా గుడి, ట్రంకురోడ్డు, శివాలయం సెంటర్, మస్తాన్‌దర్గా సెంటర్, బస్టాండ్ సెంటర్, చర్చి సెంటర్, రేల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. బిచ్చగాళ్లకు తనవంతు సాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అనంత మల్లిఖార్జునరావు ఈసందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ అన్వర్‌బాషా, అనంత రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

'బిలాల్' మూడో బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు


నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

స్థానిక కర్నూల్ రోడ్డులో నవభారత్ బిల్డింగ్స్ ఎదురు ఏర్పాటుచేసిన బిలాల్ బిర్యానీ మూడో బ్రాంచిని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ లియాఖత్, షేక్ ఖాదర్‌వలీ, సయ్యద్ జలీల్ పాల్గొన్నారు.

పొలాల్లో మోటార్ల చోరీ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని రాజంపల్లిలో పలువురు రైతులకు సంబంధించిన పొలాల్లో రాత్రి పూట గుర్తుతెలియని వ్యక్తులు మోటార్లు, కేబుల్ వైర్లు చోరీకి పాల్పడుతున్నారు. దీనిపై రాజంపల్లికి చెందిన బొర్ల వెంకటేశ్వర్లు, సుబ్బారావులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. 16 మందికి సంబంధించిన కేబుల్ వైర్లు, రెండు మోటార్లు పోయాయని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్నికలలో మీరే పోటీ చేయాలి

ఎమ్మెల్యే అన్నాతో అభిమానులు

ప్రజాశక్తి-గిద్దలూరు

2024 ఎన్నికలలో మీరే పోటీ చేయాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబును ఆయన అభిమానులు పట్టుబట్టారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తాను పోటీ నుండి విరమించుకుంటున్నట్లు ప్రకటించడంతో శుక్రవారం కూడా నియోజకవర్గంలోని పలువురు ప్రజలు, ప్రజాప్రతినిధులు మార్కాపురంలోని అన్నా నివాసానికి క్యూ కడుతున్నారు. అన్నా రాంబాబు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని 2024 ఎన్నికలలో పోటీలో ఉండాలంటూ పలువురు అభిమానులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.


ఎమ్మెల్యే అన్నాతో మాట్లాడుతున్న అభిమానులు

ఎమ్మెల్యే అన్నా మాత్రం వారికి సమాధానం ఇవ్వకుండా మాట దాటవేశారు.

పోరాడి..మృత్యుఒడికి..

- సాంబార్లో పడిన బాలుడు మృతి - తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

పది రోజులు పాటు మూడు సంవత్సరాల బాలుడు మత్యువుతో పోరాడి చివరికి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమల పట్టబీనగర్‌లో నివాసముంటున్న మస్తాన్‌వలీ, మనీషాల ఏకైక కుమారుడు మహమ్మద్ ఇంటి వద్ద పది రోజుల క్రితం వంట వండుతుండగా బాలుడు సాంబార్లో పడి నడుముల వద్ద నుంచి మొఖం వరకు మొత్తం కాలిపోయింది. ఒంగోలు ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో దాతలు సహకరించారు. గురువారం రాత్రి 11 గంటల తర్వాత బాలుడు మహమ్మద్ మృతి చెందాడని వైద్యులు చెప్పడంతో అక్కడ ఉన్న కుటుంబసభ్యులంతా ఆసుపత్రిలో తల్లడిల్లిపోయారు. శుక్రవారం నాడు తిరుమల పట్టాభి నగర్ కు బాలుడి మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు . శుక్రవారం నాడు కూడా దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్ర దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షులు పీర్ మహమ్మద్ ఆధ్వర్యంలో రూ.1,35,000ను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సలీం భాసా పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న నూర్ భాషా సంఘం నేతలు

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తా..

జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వికలాంగుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అన్నారు.శుక్రవారం బాపట్ల కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యం జరిగిన ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి అర్చన అధ్యక్షత వహించారు. విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవద్ధుల సహాయ సంస్థ చైర్మన్ ముంతాజ్ పటాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రానున్న రోజుల్లో 1750 మూడు చక్రాల మోటార్ సైకిల్ లను దివ్యాంగులకు అందజేయనున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి వికలాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు షేక్ కాలేశా, గోగన ఆదిశేషు, నటరాజ్ తదితరులు దివ్యాంగులు సమస్యలను వివరించారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వెంకన్న బాబు తదితరులు దివ్యాంగుల సంక్షేమానికి చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. జిల్లా అధికారి అర్చన మాట్లాడుతూ దివ్యాంగులకు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ శ్రీధర్

ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను వివరించారు. డిసెంబర్ 3వ తేదీన ప్రపంచ దివ్యాంగులదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ రోజు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి వి జె రామారావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి విజయమ్మ పలువురు అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపకరణాలు పంపిణీ చేశారు. 10మందికి ట్రై సైకిళ్లు, 5గురికి వీల్ చైర్స్, మరో 10మందికి చంక కర్రలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ లబ్ధిదారులకు అందజేశారు.

బైకులు ఢీకొని వీఆర్వో, వీఆర్ఏకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. హైవే అంబులెన్సు సిబ్బంది కథనం ప్రకారం.. మండల పరిధిలోని వలపర్ల గ్రామానికి చెందిన ప్రగడ రాంబాబు కోలలపూడి గ్రామ సచివాలయంలో విఆర్వోగా పనిచేస్తున్నాడు. విధుల అనంతరం తన స్వగ్రామానికి వెళ్లడానికి తన బైక్‌పై అక్కడే విఆర్‌ఎగా పనిచేస్తున్న ప్రకాష్‌తో కలిసి బైక్‌పై టోల్ ప్లాజా వద్ద టీ తాగడానికి వెళుతున్నారు. అదే సమయంలో రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనదారుడు వీరి బైక్‌ని నిర్లక్ష్యంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వీఆర్వో రాంబాబు రెండు చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక కూర్చున్న ప్రకాష్‌కి కాలు విరిగింది. వీరిని ఢీకొట్టిన మరో వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఢీ కొట్టిన బైక్ తాలూకు వ్యక్తులు వెనుకనే వస్తూ ఆ వ్యక్తిని తమ బైక్‌పై ఎక్కించుకొని అక్కడి నుండి తరలించారు. తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయిన రాంబాబు, ప్రకాష్‌లను హైవే అంబులెన్సులో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు.



బస్సు, ట్రాలీ ఆటో ఢీ..

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని 565 జాతీయ రహదారి కొనకనమిట్ల- మార్కాపురం మార్గమధ్యంలోని మర్రిపాలెం సమీపంలో ఆర్‌టిసి బస్సు- ట్రాలీ ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మార్కాపురం నుండి పొదిలికి వస్తున్న ఆర్టీసి బస్సు కొనకనమిట్ల నుండి మార్కాపురం వైపు వెళుతున్న ట్రాలీ ఆటో, రెండు వాహనాలు ఢీకొనన సంఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనాల ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ బి.బ్రహ్మానాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా..తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొమరోలు


బోల్తా పడిన లారీ

హెవీ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామ సమీపంలోని అమరావతి- కడప రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం బోల్తా పడింది. ఎదురుగా గేదెలు రోడ్డుకు అడ్డంగా వస్తున్న సందర్భంలో లారీ డ్రైవర్ గేదెలను తప్పించే క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం నుంచి లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. జగ్గయ్యపేట నుండి కడపకు పేపర్ కేషన్ ఇనుప స్తంభాలను తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని లారీ డ్రైవర్ వెల్లడించాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పోతులచెంచయ్య వెస్ట్ కాలనీలో అక్రమ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న షేక్.ఖాలేషావలిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 19 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ అరెస్టు చేసిన ఖాలేషావలిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ ఖాదర్‌బాషా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు మద్యం అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



అంగన్‌వాడీలకు మద్దతుగా మాజీ కేంద్రమంత్రి జెడి శీలం

ప్రజాశక్తి - రేపల్లె

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 18 రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా రిలే నిరాహారదీక్ష చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ దీక్షలను ప్రారబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతియుతంగా పోరాట చేస్తున్న తమపట్ల ప్రభుత్వం స్పందించకపోగా అబద్ధపు ప్రచారాలు చేస్తూ అంగన్‌వాడీలను రెచ్చగొడుతుందని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పెరిగిన వేతనాలను ఈ ప్రభుత్వం పెంచినట్లు ప్రకటన చేస్తూ తప్పు దోవ పట్టిస్తుందని అన్నారు. కావున ప్రభుత్వ వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 30న మంత్రుల ఇళ్ళు ముట్టడిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఒక పక్కన సానుకూలంగా ఉన్నామని చెబుతూ మరో పక్కన నేటికి తాళాలు పగలగొడుతున్నదని విమర్శించారు. సమ్మెను ఉదేసించు సిఐటియూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ప్రమాద బీమా ఇస్తున్నామని ప్రకటన చేస్తూ తప్పు దోవ పట్టిస్తున్నారని అన్నారు. చేతనైతే పిలిచి సమస్యలు పరిష్కరించాలి కాని ఈ పద్ధతుల్లో తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఎన్ కృష్ణకుమారి, వై మేరీమణి, డి జ్యోతి, నిర్మలజ్యోతి, లావణ్య, దీప్తి పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ధర్నా 18వ రోజుకి చేరుకుంది. మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తమకు జీతాలు పెంచి 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం వద్దని కనీస వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. చర్చలకు పిలుస్తున్న ప్రభుత్వం పరిష్కరించకుండా కాల యాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయ మైన డిమాండ్స్ నెరవేరేంత వరకు ధర్నాను కొనసాగిస్తామని చెప్పారు. అంగన్‌వాడీల ధర్నాకు వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, బి చిన్నదాసు, ఎం డేవిడ్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : అంగన్‌వాడీల నిరవధిక సమ్మె, దీక్షలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద 18వ రోజుకు నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. అంగన్‌వాడీల సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. అంగన్‌వాడీలకు మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీశేషు తమ సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు మస్తాన్ బి, శ్రీదేవి, ఎస్తేరా రాణి, శ్రీదేవి, మల్లేశ్వరి, ఆదెమ్మ, రమణ పాల్గొన్నారు.



కొల్లూరులో అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి

కొల్లూరు : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 18వ రోజు కొనసాగింది. తమ డిమాండ్స్ పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు దీక్షా శిబిరం నుండి పోలీస్ స్టేషన్, జగజ్జీవన్ రావ్ కమ్యూనిటీ హాల్ మీదగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బాల, కాశి, వనజ, నాగరాజుకుమారి, సౌభాగ్య లక్ష్మి, భాగ్యం పాల్గొన్నారు.

రేపల్లె : అంగన్‌వాడి కార్యకర్తల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి జెడీ శీలం మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్ష శిభిరం వద్దకు వచ్చి నిమ్మరసం ఇచ్చి శుక్రవారం దీక్షను విరమింపచేశారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అంజిబాబు, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల ఇన్చార్జి రామకోటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ఝాన్సీ, ఎన్ కృష్ణకుమారి, వై మేరీమణి, జ్యోతి పాల్గొన్నారు.

నగరం : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెలో భాగంగా శుక్రవారం రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. యూనియన్ నాయకులు కె రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఇవ్వని పథకాలు కూడా ఇస్తున్నామని, గతం ప్రభుత్వంలో పెంచిన జీతాలను తామే పెంచినట్లు ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రాజ్యలక్ష్మి, శివనాగులు, మంగాదేవి, నళిని, సునీత పాల్గొన్నారు.



అద్దంకిలో మానవ హారం, ఆట, పాటలతో నిరసన

అద్దంకి : అంగన్‌వాడీలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత 18రోజుల నుండి సమ్మె కొనసాగిస్తున్నారు. ఇన్ని రోజులైనా ప్రభుత్వం స్పందించక పోవడంతో స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఆట, పాటల ద్వారా నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ నాయకులు జి శారద, మను, లత, చంద్రమతి, చైతన్య, వరలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : తమకు ఇవ్వని పథకాలను కూడా అమలు చేస్తున్నట్లుగా తప్పుడు ప్రచారానికి నిరసనగా 18వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోక ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. జీతాలు పెంచకుండానే గతంలో పెంచినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, శిరీష, మంగాదేవి, సంతోష్ కుమారి, చైతన్య పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న సమ్మె 18వ రోజుకు చేరింది. అక్క, చెల్లెమ్మల డిమాండ్స్ పరిష్కరించు అన్నయ్య అని రాష్ట్రమంతా రోదిస్తున్న విన్నవించుకొని జగనన్న ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీలకు, నియోజకవర్గ ఇన్చార్జి లకు అర్జీలు ఇవ్వడానికి వెళితే కార్యకర్తలను అరెస్టు చేయడం, బెదిరింపులకు పూనుకోవటం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి బెదిరింపులు ఎన్నో చూశామని హెచ్చరించారు. గుర్రాలతో తొక్కించినా, నీటి ఫిరంగులతో తడిపిన మా సత్తా చూయించి డిమాండ్స్ సాధించుకున్న రోజులు ఉన్నాయని గుర్తు చేశారు. 18వ రోజు జగనన్నకు చెబుదాం అంటూ పోస్టు కార్డులతో లేఖలు రాసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు బిక్కి సరళ, భారతి, లక్ష్మి, అనూరాధ, తులసి, కుమారి, దేవమ్మ, రాజ్యలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

చుండూరు : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపుకోవాలని మాజీమంత్రి నక్క ఆనందబాబు అన్నారు. చుండూరు, అమృతలూరు తహశీల్దారు కార్యాలయాల వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శిబిరం వద్దకు చేరుకొని అంగన్‌వాడీల దీక్షకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలకు టిడిపి ప్రభుత్వంలో రూ.4600 నుండి రూ.10,500పెంచినట్లు తెలిపారు. అప్పట్లో టిఏ బిల్లులు, అద్దె చెల్లింపులు చేశామని గుర్తు చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు టిడిపి అండగా ఉండుందని భరోసా నిచ్చారు. టిడిపి నాయకులు, సిఐటియు నాయకులు బి ఆగస్టిన్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజు పూర్తి చేసుకుంది.సమ్మె సందర్భంగా రిలే నిరాహార దీక్షలో శుక్రవారం వినూత్న రీతిలో చేతులు అడ్డుపెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల వేతనం పెంచడం, గ్రాట్యూటీ అమలు చేయడం, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించడం వంటి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

కారంచేడు : సమస్యల పరిష్కారం కోసం గత 18రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు మండలంలోని కుంకలమర్రు సచివాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి శుక్రవారం తమ నిరసన తెలిపారు. ఇకనైనా సిఎం తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొండయ్య, అంగన్‌వాడి ప్రాజెక్టు నాయకులు రాధా, మేరీ, మరియమ్మ పాల్గొన్నారు.



భట్టిప్రోలులో అంగన్‌వాడీలకు మద్దతుగా ఆనందబాబు



కారంచేడు మండలం కుంకలమర్రులో మోకాళ్లపై నిరసన



నగరంలో అంగన్‌వాడీల నిరసన దీక్షలు

ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



ఉరితాళ్లతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసన ధర్నా

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సీఐటీయు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంకు 8వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా శిభిరంలో కార్మికులు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న పోరాటానికి ఇంజనీరింగ్ విభాగ కార్మికులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించిన చర్చల్లో కార్మికుల న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలమైన నిర్ణయం వస్తుందని ఆశించినప్పటికీ ప్రభుత్వం వైపు నుంచి ఏ విధమైన స్పష్టమైన హామీ రాని కారణంగా కార్మికులు నిరాశ చెందారని తెలిపారు. కార్మికులకు ఇవ్వవలసిన సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్లపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలపై దిగి వచ్చేవరకు సమ్మె, పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు నూతలపాటి రాజు, కార్యదర్శి ఎండ్లూరు సింగయ్య, కోశాధికారి మానికల శంకర్, గూడూరు కోటేశ్వరి, బడుగు కుమారి, బి విజయమ్మ, తిరుపతమ్మ, యశోద, సుబ్బమ్మ, గూడూరు శిరీష, పద్మ పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చేసిన పోరాటానికి ఇంజనీరింగ్ కార్మికులు జేఏసీ నాయకులు చిమటా వీరస్వామి, ఎస్‌కె బాజీ బాబు మద్దతు తెలిపారు.

అద్దంకి : పారిశుద్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ విధి లేని పరిస్థితుల్లో సమ్మెబాట పట్టారని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నాచేపట్టిన మున్సిపల్ కార్మికులు 4వ రోజు మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారానికి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఎన్నికల్లో సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి తీసుకువచ్చి కార్మికులను అనేక ఇబ్బందులు పాలు చేస్తున్నారని అన్నారు. నాలుగున్నరేళ్ల నుండి కార్మిక సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. వీధులు శుభ్రం పరచాలంటే కార్మికుల అవసరమైనప్పటికీ వారి సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు పి ఆదాం, భీష్మ, అంజమ్మ, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి అంబేద్కర్ సర్కిల్‌లో మునిసపల్ కార్మికుల ధర్నా



దీక్షా శిభిరంలో అస్వస్థతకు గురైన అంగన్‌వాడీ కార్యకర్త

దీక్షలో అస్వస్థతకు గురైన కార్యకర్త

ప్రజాశక్తి - చీరాల

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేస్తున్న దీక్షలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు జి సుజీవన దీక్షా శిబిరంలో స్వస్థత గురై పడిపోయారు. గమనించిన యూనియన్ నాయకులు, కార్యకర్తలు వెంటనే ఆమెను ఏరియా వైద్యశాలకు తరలించారు. శుక్రవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు మాట్లాడుతూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అంగన్‌వాడి కార్యకర్తలు దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ధర్నా చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలపై ప్రభుత్వం పరోక్ష దాడులకు దిగడం సరికాదని హెచ్చరించారు. బలవంతంగా అంగన్‌వాడి కేంద్రాలను తెరిపించినంత మాత్రాన లబ్ధిదారులు ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పి ప్రమీల, బ్యూలా, శిరీష పాల్గొన్నారు.

18వ రోజు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - టంగుటూరు

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలోప్రజా సంఘాల సహకారంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ హెచ్చరించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 18 రోజూ అంగన్‌వాడీలు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్ వాడీల డిమాండ్లను పరిష్కరించాలన్న ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం లేదని కొండపి ఎమ్మెల్యే స్వామి తెలిపారు అంగన్‌వాడీల సమ్మెకు ఎమ్మెల్యే మద్దతు తెలిపి మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేశపోగు


టంగుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

మోజస్, టిడిపి మండల, అధ్యక్షుడు కామని విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు కామని నాగ శ్రీను, టిడిపి నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, ధర్నాసి బ్రహ్మానందం, అంగనాడీ యూనియన్ నాయకులు బి. శేషమ్మ, పి.క్రాంతి, జి.ప్రసన్న, కమరున్నీసా, వై.విజయ, డి.సునీత, శ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : అంగన్‌వాడీల సమ్మెలకు సంఘీభావంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొనకనమిట్ల మండల శాఖ


వెలిగండ్లలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఆధ్వర్యంలో రూ.6వేల నగదులు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులతో మాట్లాడి వారి న్యాయమైన సమస్యను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర శిశువిద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంగన్‌కేంద్రాల బలోపేతానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాల వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కామేశ్వరరావు, పొదిలి మండల అధ్యక్షుడుసత్యనారాయణ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి ,సిఐటియు జిల్లా నాయకుడు ఎం.రమేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు శోభ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : అంగన్‌వాడీల సమ్మెకు ప్రజా సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. అంగన్‌వాడీల సమ్మె ఉధృతం కాక ముందే సిఎం జగన్ మేల్కొనాలని, అంగన్‌వాడీల సమస్యలకు పరిష్కారం చూపాలని సిఐటియు జిల్లా నాయకులు డికెఎం. రఫి, పి.రూబెన్ విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు టి.గురునాథం, ఎం.లక్ష్మి, జి.ఆదిలక్ష్మి, ఎ.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి వెంకటేష్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు యక్కంటి రాధమ్మ, సుధారాణి, పద్మ, సౌజన్య, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, నాగవేణి, రమణమ్మ,స్వప్న,పద్మ పాల్గొన్నారు.

కనిగిరి : అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సిఐటియు జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు పిసి. కేశవరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామసుబ్బులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి, తిరుపాలు ు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్క రించాలని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర కోరారు. అంగన్‌వాడీల సమ్మెకు రవీంద్ర మద్దతు తెలిపి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, టిడిపి మండల అధ్యక్షుడు షేక్ జిలానీ, త్రిపురాంతకం మండల టిడిపి మాజీ అధ్యక్షులు ఓట్ల సీతయ్య, పెద్దారవీడు మండల టిడిపి మాజీ అధ్యక్షుడు వెన్నా వెంకటరెడ్డి, మర్రివేముల మాజీ సర్పంచి రావూరి సుబ్బారావు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల కోటేశ్వరరావు, నాయకులు వడ్లమూడి లింగయ్య, మేకల బాదరయ్య యాదవ్, యువ నాయకులు కొర్రపోలు సుందర్ రావు, పోలబోయిన శివయ్య, అంగన్‌వాడీ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పాల్గొన్నారు.

మద్దిపాడు : అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరకూ ఖండించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. చర్చల పేరుతో పిలిచి మామ అనిపిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం గురించి ఎవరూ నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకా సుబ్బారావు, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, జయప్రద, రజిని, ఆదిలక్ష్మి, శారద, మాధవి, నిషా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


పొదిలిలో ఆర్థిక సాయం అందజేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

కొండపి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తొలుత పోస్టాఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి తమ సమస్యలను గురించి తెలియచేస్తూ పోస్టుకార్డులు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని


కొండపిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వందనం, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దర్శి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు


వైపాలెంలో మాట్లాడుతున్న డాక్టర్ మన్నే రవీంద్ర

ఎ.తిరుపతమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం నిరహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, సుజాత, అంజమ్మ, సుబ్బమ్మ, అనిత, నాగజ్యోతి, విశ్వవాణి, మల్లేశ్వరి, పద్మావతి, సందు వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, నారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంభం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో కంభం, అర్ధవీడు ,బేస్తవారిపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై అవస్తవాలు చెప్పడం మానుకోవాలన్నారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ షేక్ అన్వర్ బాషా, కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల అంగన్‌వాడీలు శ్రీదేవి, ఆదిలక్ష్మి, సరళ దేవి ,రమణమ్మ ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.


కంభంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


మద్దిపాడులో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు


కనిగిరిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి


ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దారు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో 2024 ప్రజాశక్తి క్యాలెండర్‌ను తహశీల్దారు కె. రవీంద్రారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల ప్రజాశక్తి విలేకర్లు షేక్ వలీసాహెబ్, గొట్టెముక్కల రాజారామయ్య, డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, సీనియర్ అసిసెంట్ గోపాలుని లక్ష్మి ప్రసాద్, రామ సముద్రం సర్పంచి పిచ్చయ్య, త్రిపురాంతకం జడ్‌పి హైస్కూల్ కమిటీ వైస్ చైర్మన్ అద్దంకి శ్రీను పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రీ కొప్పరపు వెంకటకష్ణ నిలయం (రీడింగ్ రూమ్) ఆధ్వర్యంలో జవహార్‌నగర్ కాలనీలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దుప్పట్ల పంపిణీ చేశారు. మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా చేతుల మీదుగా విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మానసిక వికలాంగ విద్యార్థులకు ఎంత చేసినా తక్కువేనని తెలిపారు. మానసిక వికలాంగులకు తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రీడింగ్ రూమ్ కమిటీని సబ్ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రీడింగ్ రూమ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శాసనాల వీరబ్రహ్మం, సహాయ కార్యదర్శి ఎం.మోహన్‌రెడ్డి, కోశాధికారి మల్లికార్జునరావు, సభ్యులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

టిడిపితోనే పేదలకు అండ : స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

టిడిపితోనే పేదల అండ అని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని దేవరపల్లి రాఘవయ్య కాలనీలో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, షేక్ సందాని బాషా, షేక్ అబ్దుల్, సుబహాన్, సుదర్శి ప్రసాదరావు, షేక్ యస్‌ధాని, వేల్పుల సురేష్, వెంకటేష్ చౌదరి, శీలం సుబ్రహ్మణ్యాం చిగురుపాటి శేషగిరి, కనిగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిల్లల మనసెరిగిన ఉపాధ్యాయుడు

• విద్యార్థులతో మమేకం • వారితోనే సావాసం • రహంతుల్లా బోధనా తీరే వేరు • కన్నీళ్లు పెట్టుకుని.. బదిలీని ఆపించిన విద్యార్థులు


నేలపైనే కూర్చుని అక్షరాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు రహంతుల్లా

ప్రజాశక్తి - పంగులూరు

విద్యార్థులతో ఆడతాడు. విద్యార్థులతో పాడుతాడు. విద్యార్థుల ప్రక్కన నేల మీదే కూర్చుంటాడు. వాళ్లని అక్కున చేర్చుకొని పాఠాలు చెబుతాడు. అందుకే ఆయనంటే విద్యార్థులకు ఇష్టం. ఆ విద్యార్థులంటే ఆయనకు ప్రాణం. ఆయనే మండలంలోని కొండమూరు దళిత కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యుడు షేక్ రహంతుల్లా. అతను గత నాలుగు సంవత్సరాలుగా ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పాఠశాలకు అరగంట ముందే చేరుకుంటాడు. విద్యా ర్థుల మంచి చెడ్డలన్నీ ఆయనే చూసుకుంటాడు. ఎవరైనా విద్యార్థి పాఠశాలకు రాకపోతే నేరుగా ఇంటికెళ్ళి తన బండి పై ఎక్కించుకొని పాఠశాలకు తీసుకొస్తాడు. విద్యార్థుల చదువుపైనే కాకుండా, వారి ఆరోగ్యంపైన కూడా దృష్టి పెడతాడు. విద్యార్థులకు ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే ఉపాధ్యాయుడిగా తను చేయాలిసింది చేస్తాడు. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించటమే కాకుండా, వారితో పాటు కలిసి కూర్చొని వాళ్లలో ఒక స్నేహితుడిగా, ఒక ఆత్మీయుడుగా కలిసిపోతాడు. దగ్గరికి తీసుకొని ఎంతో ఆత్మీయతతో పాఠాలు చెబుతాడు. వాళ్ళ ఆటపాటల్లో కూడా దగ్గరుండి వాళ్లకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తాడు. అందుకే ఆ ఉపాధ్యాయుడు అంటే ఆ విద్యార్థులకు వల్లమాలిన అభిమానం. ఇటీవల ప్రభుత్వం 3, 4, 5తరగతులను ఉన్నత పాఠశాల్లో విలీనం చేసింది. ఆ సమయంలో రహమతుల్లా టీచర్‌ను ఆ ఊర్లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. రహంతుల్లా మాస్టారు తమ బడి విడిచి వేరే బడికి వెళుతున్నాడని తెలిసిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను తీసుకొచ్చి ఆయనను కదలనీయ కుండా చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు బోరున విలపించారు. తల్లిదండ్రులు కూడా రహంతుల్లా టీచర్ వేరే స్కూలుకు వెళ్ళటానికి లేదని పట్టుబట్టారు. దీంతో అధికారులు రహంతుల్లా మాస్టారును బదిలీ చేయకుండా అదే పాఠశాలలో ఉంచారు. విద్యార్థులకు ఆయనకు మంచి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. పాఠశాలలో విద్యార్థులంతా తన సొంత బిడ్డలు గాని ఆయన చూసుకుంటాడు. అందుకనే ఆయనంటే విద్యార్థులకు అంత ఇష్టం. ఆయన కు విద్యార్థులు అంటే అంత మమకారం. ప్రస్తుత పరిస్థి తుల్లో ఇంకా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగిస్తు న్నాయంటే ఇలాంటి ఆదర్శ ఉపాధ్యాయులు ఉండ బట్టేనని గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

ఐక్యతతో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత


బిసి సంక్షేమ సంఘం సమావేశంలో కేసన శంకరరావు

ప్రజాశక్తి - పర్చూరు

బీసీలు ఐక్యతతో సమస్యల పరిష్కారంపై నిరంతరం బీసీ సంక్షేమ సంఘం పనిచేస్తుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. స్థానిక పంక్షన్ హాల్లో ఆ సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకు సంఘ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీ కాలనీలో సమస్యలపై పోరాడాలని సూచనలు చేశారు. బీసీల్లో పటిష్టమైన నాయకత్వం ఉందన్నారు. భవిష్యత్ కార్యక్రమంపై సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మండల కమిటీలు ఈపాటికే నియమించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. బీసీలకు తమ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీలకు తెలిసేలాగా కార్యచరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి అధ్యక్షుడిగా చేబ్రోలు రవీంద్రచారికి నియామక పత్రాన్ని అందజేశారు. పర్చూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బంకా మాధవరావు, కారుమంచి రామాంజనేయులుకు ఎంపిక పత్రాలను అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు2గా శ్రీనివాసాచారిని నియమించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు1 జొన్నాదుల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్ పాల్గొన్నారు.

పంగులూరు : అద్దంకి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పంగులూరు గ్రామానికి చెందిన చేబ్రోలు రవిచంద్రను ఎన్నుకున్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు జువ్వ శివరాం ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం పర్చూరులో నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.


పెచ్చులూడి ఊసలు కనిపిస్తున్న పిహెచ్‌సి భవనం

పిహెచ్‌సిలో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సు గదిలో స్లాబ్‌పై పెచ్చులు ఊడి ఇనుప సువ్వలు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆరోగ్య సిబ్బంది, పేషెంట్లు ఆందోళన చెందుతున్నారు. ఈ గదిలో నిత్యం నర్సు విధులు నిర్వహిస్తూ ఉంటుంది. పేషెంట్లు ఈ గదిలోకి వచ్చి ఓపి, ఇంజక్షన్స్ తీసుకుంటుంటారు. ఈ ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ప్రక్కనే నూతనంగా మరో భవనం నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న హాస్పటల్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. హాస్పిటల్‌కి వచ్చిన పేషెంట్లు నర్సు గదిలోకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఏ క్షణంలోనైనా గది పైకప్పు కూలవచ్చని చూస్తేనే అర్థం అవుతుంది. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే ప్రత్యామ్నయం చూడాలని ఆరోగ్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

నెరవేరిన చంద్రబాబు హామీ

రూ.5 లక్షల అందజేసిన ఏలూరి

ప్రజాశక్తి - పర్చూరు

మిచాంగ్ తుఫాను ప్రభావంతో సర్వం నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు కొద్దిరోజుల క్రితం వచ్చారు. అప్పట్లో అన్నదాతలను ఆదుకునేందుకు హామీ ఇచ్చారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న అన్నదాతలను ఓదార్చి రైతులకు అండగా ఉంటానని బరోసా ఇచ్చారు. అధినేత హామీ మేరకు టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తరపున టిడిపి మండల నేతలు ఐదుగురు రైతులకు రూ.5లక్షలు శుక్రవారం అందజేశారు. చెరుకూరు రైతులకు చంద్రబాబు ఇచ్చిన భరోసా మేరకు గ్రామానికి చెందిన నాలుగున్నర ఎకరాల పొగాకు సాగు చేసిన రైతు కత్తి బుషికి రూ.60వేలు, గడ్డం అంకయ్య అనే రైతుకు రూ.2లక్షలు, వై నారాయణస్వామి అనే రైతుకు రూ.2.05లక్షలు, కె కృష్ణ అనే రైతుకు రూ.30వేలు ఆర్థిక సహాయం అందజేశారు.


రైతులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న టిడిపి నేతలు


విద్యార్థుల వంటలను అభినందిస్తున్న మురళీకృష్ణ

ఆదర్శ ఫుడ్ ఫెస్ట్ అదుర్స్

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆదర్శ హైస్కూలులో 7వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన ఫుడ్ ఫెస్ట్ ఆకట్టుకుంది. విద్యార్థినీ, విద్యార్థులు వివిధ రకాల వంటకాలతో ఆహా అనిపించారు. వివిధ వంటకాలు తయారు చేసి ఏర్పాటు చేసిన స్టాల్స్ అలరించాయి. విద్యార్థులు తయారు చేసిన పానీపూరి, గులాబ్‌జామ్, టమాటా రైస్, మజ్జిగ, దోసెలు ఆహా అనిపించాయి. ఫుడ్ ఫెస్ట్‌ను జైహనుమాన్ మోటార్స్ అధినేత చుండి మురళీకృష్ణ ప్రారంభించారు. ఫుడ్ ఫెస్ట్ నిర్వహణకు సహకరించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను కరస్పాండెంట్ తోట కూర విజయభాస్కర్ అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతను పెంచుతాయని అన్నారు. సమాజంపట్ల అవగాహన కలిగిస్తాయని చెప్పారు.

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో పలువురు శుక్రవారం టిడిపిలో చేరారు. మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన 37కుటుంబాలు టిడిపి లో చేరారు. ఎంఎల్ఎ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన ఎస్‌సి కుటుంబాలు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఇ సత్యనారాయణ

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - అద్దంకి

రైతుల సాగు చేసిన పంటలు ఎండి పోకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని స్థానిక విద్యుత్ అధికారులకు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ కెవిజి సత్యనారాయణ సూచించారు. సింగరకొండ రోడ్డులోని సబ్ డివిజనల్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజనల్ పరిధిలో 565మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డిడిలు ఇచ్చి ఉన్నారని, వారికి తక్షణమే విద్యుత్ సదుపాయం 2024జనవరి 5లోపు అవసరమైన చర్యలు చేపట్టాలని చెపపారు. రైతులకు కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ ఈఈ నల్లూరి మస్తానరావు, అద్దంకి, మార్టూరు డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.


కాంగ్రెస్ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం కోరారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి తాడికొండ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జెడిసెలం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం లభిస్తుందని అన్నారు. అనివార్య కారణాలవల్ల రాష్ట్ర విభజన జరిగిందని అన్నారు. దీని కారణంగా దూరమైన కాంగ్రెస్‌ను తిరిగి రాష్ట్రంలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. నేటి పాలకులు దానిని విస్మరించి మోడీ భజన చేయటం వలన చట్టం కనుమరుగైందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. ప్రాంతీయ పార్టీలు కులతత్వ పార్టీలుగా మారాయని అన్నారు. కుల పార్టీల కుంపటితో అభివృద్ధికి దూరమైందని అన్నారు. కాంగ్రెస్ యువతను ప్రోత్సహించే విధంగా నూతన కమిటీలు నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిజాంపట్నం ఏడుకొండలు, గౌస్ బేగ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - చిన్నగంజాం

దేవుని యందు భయభక్తులు కలిగి జీవించి దేవుని ఆశీస్సులు పొందాలని సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో పాటల పోటీల్లో విజేతలైన చప్పిడి నిహాల్, మేడికొండ రాజ్ కుమార్, చప్పిడి అభిలాష్, మార్పు యశ్వంత్, మేడికొండ నానికి వార్డు సభ్యుడు మార్పు సుకుమార్, జెడ్‌పి ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ మేడికొండ సాంబశివరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్యారల్స్ నిర్వహకుడు మేకల మేషక్ బాబు, కందుల పృద్వి, కట్టా దిలీప్ పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం జగన్ విఫలం

- నవ మోసాలుగా నవరత్నాలు
- 730హామీల్లో 109మాత్రమే అమలు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపణలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీల అమలులో 85 శాతం ఫెయిల్ అయ్యారని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన 730హామీల్లో 109మాత్రమే అమలు చేశారని అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలు కాదని నవ మోసాలని ఎద్దేవా చేశారు. నవ మోసాల పేరుతో 152పేజీల పుస్తకాన్ని విడుదల చేశారు. టిడడిపి నేతలకు పంపిణి చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కేవలం 15శాతం హామీలనే నెరవేర్చి, 85శాతం హామీలను విస్మరించడం వంచన కాదా అని ప్రశ్నించారు. వైసిపి మ్యానిఫెస్టోను పవిత్రమైన బైబిల్‌తో పోల్చిన జగన్ దాన్నెందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని అన్నారు. మాటమీద నిలబడకపోతే పదవికి రాజీనామా చేయాలని గతంలో ప్రగల్భాలు పలికిన జగన్ ఇచ్చిన హామీల్ని అమలు చేయనందుకు లెంపలేసుకొని సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మద్యపాన నిషేధం, అయిదేళ్లలో 25లక్షల ఇళ్ల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ సహా వివిధ వర్గాలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాలవారీగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును పుస్తకంలో సమగ్రంగా పొందుపర్చామని అన్నారు. 99.5శాతం హామీల్ని అమలు చేసినట్లు జగన్, ఆయన మీడియా, వైసిపి నాయకులు పచ్చి అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం అయిదేళ్లలో రూ.7లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే, అందులో రూ.3లక్షల కోట్లు సంక్షేమానికే ఖర్చు చేసిందని అన్నారు. జగన్ మాత్రం రూ.10లక్షల కోట్లు అప్పులు చేశారని, రూ.2లక్షల కోట్లు పేదల రక్తం పిండి వసూలు చేశారని అన్నారు. రూ.12లక్షల కోట్లు బటన్ నొక్కానని చెబుతున్నప్పటికీ లబ్దిదారులకు అందింది రూ.2.4లక్షల కోట్లేనని, మిగిలిన సొమ్ము ఎటు పోయిందో సీఎం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేసిన 120పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. నాలుగేళ్ల 8 నెలల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని అన్నారు. టిడిపి హయాంలో 72శాతం పూర్తయిన పోలవరం పనులను వైసిపి ప్రభుత్వ హయంలో అడుగు ముందుకు కదల్లేదన్నారు. తన దోపిడీని ఎదుటి వారికి అంటకట్టి, చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్‌రెడ్డి నైజమని ఆరోపించారు.

నకిలీ వేలిముద్రలు తయారు చేసి..

అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-త్రిపురాంతకం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

నకిలీ వేలి ముద్రలను తయారు చేసి ఏపిఈఎస్ ద్వారా అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న ముగ్గురు నేరస్తులను త్రిపురాంతకం సిఐ పాపారావు సారథ్యంలో ఎస్ఐ సుదర్శన్ పోలీస్ సిబ్బందితో వెళ్లి వల పన్ని పట్టుకున్నారు. నకిలీ వేలిముద్రలతో అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారని ఈ నెల 27వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు వలపన్ని త్రిపురాంతకం మండలం మేడపి గ్రామానికి చెందిన షేక్ జాన్‌బాషా, అర్ధవీడు మండలం మావుటూరి తండా కృష్ణానగర్‌కు చెందిన దేశావత్ ఉదయ్ కిరణ్ నాయక్, పెద్దదోర్నాల మండలంలోని చెంచుపాముల కాలనీకి చెందిన షేక్ మదార్‌వలి అనే ముగ్గురు నకిలీ వేలిముద్రలతో అక్రమంగా డబ్బు సంపాదిస్తున్న నేపథ్యంలో శుక్రవారం వారిని త్రిపురాంతకం మండలం మేడపిలోని నిందితుడి ఇంటి వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నకిలీ వేలిముద్రలను తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుదర్శన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిపై డిపిఒ విచారణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు


పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై డిపిఒ రాంబాబు విచారణ

పంచాయతీలో జరుగు తున్న వివిధ రకాల కార్యక్రమాలపై డిపిఒ రాంబాబు పరిశీలించారు. స్థానిక పంచా యతీలో నెలకొన్న అవినీతి కార్య క్రమాలపై గ్రామ స్తులు డిపిఓకు ఫిర్యాదు చేయగా దానిపై పరిశీలన చేపట్టారు. దీనిలో భాగంగా పంచాయతీకి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి విచారించారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా విచ్చేసి నట్లు చెప్పటం కోసం మెరుపు. పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించిన ఆయన సంబంధిత వివరాలు వెల్లడించేందుకు దాటవేశారు. ఇంటి పన్ను బిల్లులు నేరుగా పంచాయతీ ఎకౌంట్ కు జమ అయ్యేవిధంగా స్వైప్ ద్వారా సేకరిస్తున్నామని తెలిపారు. దానికి గాను పంచాయతీకి నాలుగు మిషన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. సిబ్బంది ద్వారా ఇంటి పన్నులు వసూలు చేసే క్రమంలో కొంత సొమ్ము అన్యాక్రాంతం అవుతున్నట్లు వెలుగు చూడటంతో ప్రభుత్వం నేరుగా ఇంటి యజమానుల నుండి పంచాయతీ ఎకౌంటుకు జమ అయ్యే విధంగా రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి ఊహారాణి, భట్టిప్రోలు సర్పంచ్ రవికిరణ్మయి, కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, రామ్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ ఆశయం

ప్రజాశక్తి - రేపల్లె


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి శీలం

రాష్ట్ర అభివృద్ధి కాగ్రెస్ ఆశయమని మాజీ కేంద్ర మంత్రి జెడీ శీలం అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ప్రధాన మంత్రులు పండిట్ జవహర్లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు, ఎన్టీఆర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలో నిరవధిక దీక్షలు చేస్తున్న లాయర్లకు, అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు 10ఏళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎదిరించలేక ప్రాంతీయ పార్టీల నాయకులు తలలు వంచి మోదీ జపం చేశారని విమర్శించారు. ఆంధ్రులకు అన్యాయం జరగకూడదని ఆనాడు సోనియాగాంధీ వివిధ అంశాలతో చట్టం రూపొందించారని చెప్పారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తామని, ప్రత్యేక హోదా సాధిస్తామని అధికారం చేపట్టిన ప్రాతీయ పార్టీల నాయకులు కేంద్రం వద్ద మెడలు వంచారని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి బలోపేతం అవుతుందని చెప్పారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఇంచార్జ్ కేసన రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విభజన హామీలు అమలు చేస్తామని తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, విశాఖ ఉక్కును పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రలో ప్రజా రంజక పాలన చేస్తామని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక సిద్దం చేసినట్లు తెలిపారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు

బియ్యం అక్రమాలకు సిద్ధమైనట్లు ఆరోపణలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు


బియ్యం అక్రమ రవాణాకు సిద్దంగా నంబర్‌లేని వాహనాలు

ఒకటవ తేదీ నుండి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేసే రేషన్ బియ్యం డీలర్లకు చేరుతున్నాయి. బియ్యం పంపిణీ ప్రారంభమైన రెండు, మూడు రోజుల నుండి డీలర్ల వద్ద ఉన్న బియ్యం పంపిణీ వాహనాలతో అక్రమంగా తరలించేందుకు అక్రమార్కులకు సిద్దమవుతున్నారు. ఈ బియ్యాన్ని తరలించేందుకు గ్రామంలో అక్రమ వ్యాపారులు దాదాపు నాలుగైదు నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సిద్ధం చేసి ఉంచారు. ప్రతినెల అక్రమ బియ్యం ఈ నెంబర్ ప్లేట్లు లేని వాహనాల ద్వారానే వివిధ ప్రాంతాలకు తరలిస్తూ ఉంటారు. నెలాఖరు కావడంతో వాటిని సిద్ధం చేసి స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంకులో సిద్ధం చేసి ఉంచారు. ఈ నెంబర్ లేని వాహనాలు ఇతర ప్రాంతాల్లో అయితే సంబంధిత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉండటంతో వీటిని ఎవరికి అనుమానం రాకుండా పెట్రోల్ బంకులో ఉంచినట్లుగా ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ బియ్యం వ్యాపారం చేసే అక్రమార్కులకు ఎస్సార్ పేరుతో రెండు పెద్ద లారీలు, మరో నాలుగు నంబర్ ప్లేట్ లేని మినీ లారీలు ఉన్నాయి. రహదారిపై నడిచే వాహనాలకు సంబంధిత పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేసే ఆర్టీఓ అధికారులకు ఎలాంటి నెంబరు ప్లేటు లేకుండా అక్రమంగా రవాణా చేసే వాహనాలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం రేషన్ అక్రమ తరలింపుకు మాత్రమే వినియోగించే ఈ వాహనాలు రాత్రి వేళల్లో మాత్రమే బయట తిరుగుతుంటాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులకు ఈ వాహనాలు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల క్రితం ఒక వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వీటి వెనుక రాజకీయ ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఏ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

29 బాటిళ్ల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - సంతమాగులూరు


మండలంలోని చవిటిపాలెం గ్రామంలో శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎంవి కుమార్ తెలిపారు. అతని వద్ద ఉన్న 29మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గ్రామంలో రైడ్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు.


వేతనాలు కోరుతూ పంచాయితీ కార్మికుల ధర్నా

పంచాయతీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక పంచాయతి కార్యాలయం వద్ద పంచాయితీ పారిశుద్య కార్మీకులు చేస్తున్న ధర్నాకు సిఐటియు నాయకులు జి ప్రతాప్ కుమార్ మద్దతు తెలిపారు. 7రోజుల నుండి పారిశుద్ధం కొరవడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిరసన దీక్షలు చేస్తున్నప్పటికీ పంచాయితీ అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. పెండింగులో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి వెంకటేశ్వర్లు, సత్యానందం, నల్లపు రంగారావు, సుబ్బరావు, రాఘవేంద్రరావు, కాలేబు, కోటి పాల్గొన్నారు.


పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపిపి లలిత

వైద్యశాల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కమిటీ చైర్మన్ ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడారు. వైద్యశాలలో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమస్యలైమైనా ఉంటే కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉందని అన్నారు. వైద్యశాలకు అవసరమైన మందులు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల నుండి రోగులు వస్తూ ఉంటారని అన్నారు. వారిని ఆదరించి చికిత్స అందించాలని పేర్కొన్నారు. వైద్యశాలకు అవసరమైన పరికరాల కొనుగోలు అంశాన్ని చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో వైద్యశాల కమిటీ కన్వీనర్ సిహెచ్ రామలక్ష్మి, తహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఎంపీడీఒ గుమ్మా చంద్రశేఖర్, మోర్ల విజయలక్ష్మి సత్యనారాయణ, డాక్టర్ పద్మజా కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచి ధారా రవికరణ్మయి, నాయకులు చెన్నయ్య, బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


ఇంటింటికీ టిడిపి కార్యమ్రంలో చీరలు పంచుతున్న వర్మ

వైసిపీకి నూకలు చెల్లాయి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో వైసీపీకి నూకలు చెల్లాయని టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని దేవుడి మాన్యం, మండలంలో మూలపాలెంలో ఇంటింటికి టిడిపి, మీ మాటే - నా బాట, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు సిఎం అయితేనే సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.

సమగ్ర ఉద్యోగులను చర్చలకు పిలవాలి

- ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ - సమ్మెకు జనసేన పార్టీ మద్దతు



ఒంగోలులో డిఇఒకు అర్జీ ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జెఎసి నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలవాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె 10వ రోజుకి చేరుకుంది. కార్యక్రమానికి జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి అధ్యక్షత వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు జన సేన పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. జనసేన- టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ సమగ్ర శిక్షలో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులను వెంటనే చర్చలకు పిలిచి వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.ఉమామహేశ్వరి మాట్లాడారు. జెఎసికి ఒంగోలు రాంనగర్ హై స్కూల్ కాంప్లెక్స్ సోషల్ ఉపాధ్యాయులందరూ రూ.10 వేల ఆర్థిక సహకారం అందించారు. కొత్తపట్నం మండలం ఆలూరు జడ్.పి.హెచ్.ఎస్ ఉపాధ్యాయులందరూ రూ.10 వేలు, బిటిఎ రాష్ట్ర అధ్యక్షుల వెంకట్రావు రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ర్యాలీగా జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి జిల్లా విద్యాశాఖ అధికారి వివిఎస్ సుబ్బారావును కలసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఎం.హరిబాబు, మధు, నరసింహం, ప్రకాశం జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



బాపట్లలో ఉద్యోగుల మానవహారం


బాపట్లలో మానవహారం

బాపట్ల: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె బాపట్లలో తొమ్మిదో రోజుకు చేరింది. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసుకున్న సమ్మె శిబిరం నుండి ఉద్యోగులు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో చీల్ రోడ్డు సెంటర్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సమ్మె చేస్తున్న సమగ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు సంఘీభావం తెలిపారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన వారిలో సిఐటియు ,యుటిఎఫ్, ఎస్‌టియు, సిపిఐ పలు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి. మాణిక్య రావు, రవికిరణ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, సర్వ శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రోత్సాహాన్ని

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వం కల్పించే అవకాశాలు, ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని.. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. జగనన్న విద్యాదీవెన నగదు పంపిణీ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి శుక్రవారం ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారం అయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేయగా తదుపరి జిల్లాలోని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి చేతుల మీదుగా చెక్కు రూపంలో నగదు పంపిణీ చేశారు.

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యాభివద్ధికి ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలు, అవకాశాలు లేవని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అందిస్తూ విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద జిల్లాలోని పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, కాపు సామాజిక వర్గానికి చెందిన 25,973 మంది విద్యార్థులకు రూ.20.73 కోట్ల నగదు విడుదలైందన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. విద్య భారం కారాదనే దకృథంతో విద్యార్థుల కోసం అనేక పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయన్నారు. మానవ వనరుల అభివద్ధితోనే రాష్ట్రం పురోభివద్ధిలో పయనిస్తుందని నమ్మిన గొప్ప వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి అని చెప్పారు. ఆ దిశగా పేదలకు ఉన్నతమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కషి చేస్తున్నారన్నారు. పేదల పక్షాన నిలిచి పనిచేసే ప్రభుత్వముగా వైసిపి ఏపీలో చెరగని ముద్ర వేసుకున్నట్లు ఆయన వివరించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అలా ఎదిగినప్పుడు సమాజంలో మీ బాధ్యతను గుర్తించి సమాజ హితం కోరుతూ పనిచేయాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని జె.రాజాదిబోరా, బీసీ సంక్షేమశాఖ అధికారి బి.అర్జున్ రావు, పర్యవేక్షకులు ఆంధ్ర శ్రీనివాసులు, సహాయ సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెక్షన్‌పై గరం గరం

- **పనుల నాణ్యత, నీటి సరఫరాపై ఆగ్రహం**
- **కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై నిలదీసిన కార్పొరేటర్లు**
- **టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం**





మాట్లాడుతున్న దాచర్ల రమణయ్య, కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో జరిగింది. నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య ధ్వజమెత్తారు. సరైన ఇసుక వాడటం లేదని, నిబంధల ప్రకారం సిమెంటు వినియోగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులు నాలుగైదు నెలలకే దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. థర్డ్ పార్టీగా ఉన్న క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీకి సమయం అయిపోయినా పాత వారి నుంచే సర్టిఫికెట్లు తీసుకువచ్చి కార్పొరేషన్‌లో బిల్లులు చేయిస్తున్నారని వివరించారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేసే పనులమీద సరైన పర్యవేక్షణ లేకపోవడాన్ని తప్పుపట్టారు. గతంలో ఎక్కువ లెస్‌లు వేసి కాంట్రాక్టర్‌లు పనులు చేసినా నాణ్యతా ప్రమాణాలు ఉండేవని, ఇప్పుడు తక్కువ లెస్‌లతో పనులు చేసినా పనుల్లో నాణ్యత ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా జరిగిన పనుల మీద సీనియర్ కార్పొరేటర్‌లతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. రూ.పది లక్షల రూపాయల లోపు పనులు కమిషనర్ స్థాయిలో ఆమోదించడానికి అవకాశం ఉన్నా ప్రతిపక్ష పార్టీ సభ్యుల డివిజన్‌లలో ఇది అమలు కావడం లేదన్నారు. పనుల మంజూరులో తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని సరఫరా అవుతున్న నీటిలో క్లోరినేషన్ సక్రమంగా జరగడం లేదని డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు అన్నారు.

తమ డివిజన్‌లో రోడ్డుమీద రోడ్డు వేసి పనులు చేశారని కార్పొరేటర్ చింతపల్లి గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్‌లకు సంబంధం లేకుండా అత్యవసరం కాని పనులకు కూడా మేయర్ ముందస్తు ఆమోదం తెలపడాన్ని టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య తప్పుపట్టారు. ముఖ్యమైన పనులు ఏమైనా చేపట్టాల్సి ఉంటే కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు కూడా సమ్మతి తెలిపారు. కౌన్సిల్ అనుమతి లేకుండా మేయర్ ముందస్తు అనుమతి ఇచ్చిన అజెండాలోని నాలుగు అంశాలకు టిడిపి కార్పొరేటర్లతో పాటు జనసేన పార్టీ కార్పొరేటర్ కూడా డీసెంట్ ప్రకటించారు. డీసెంట్ కాపీని మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు.

టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరు అధ్వానంగా ఉందని, తమ డివిజన్‌లో అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, రోడ్లు, కాల్వలు ఆక్రమణలకు గురవుతున్నా ఆవిభాగం అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని అనేకసార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా వారిమీద ఎలాంటి చర్యలు లేవన్నారు. తన డివిజన్‌లో గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలు ఎప్పటికి తొలగిస్తారో అర్థం కావడం లేదని కార్పొరేటర్ చింతపల్లి గోపి ప్రశ్నించారు.

తమ డివిజన్‌లో బ్లీచింగ్ సక్రమంగా చల్లడం లేదని, ఇటీవల వర్షాలు వస్తే నగరంలో ఎక్కడా బ్లీచింగ్ చల్లిన పాపానపోలేదని, అస్సలు నగరపాలక సంస్థలో బ్లీచింగ్ ఉందా...? లేదా..? అని కార్పొరేటర్ యనమల నాగరాజు ప్రశ్నించారు. తన డివిజన్‌లో 20సెంట్లు పార్కు స్థలం ఆక్రమకు గురైందని, దానిమీద వెంటనే చర్యలు తీసుకొని పార్కు స్థలానికి పెన్సింగ్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ కోరారు. నగరంలో ఉన్న కార్పొరేషన్ ఖాళీ స్థలాల జాబితా సిద్ధం చేసి తనకు ఇవ్వాలని మేయర్ గంగాడ సుజాత టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. తన డివిజన్‌లో జరిగే పనులకు తనకు సమాచారం ఉండటం లేదని, కమ్యూనిటి హాలు నిర్మిస్తుంటే కనీసం తనకు తెలియను కూడా తెలియదని, కార్పొరేటర్లుగా తమకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందా..?లేదా..?అని కార్పొరేటర్ బెంగళూరు నర్సయ్య నిలదీశారు.

కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అస్తవ్యస్థంగా ఉందని, ఇందుకు రెండేళ్ల కిందట వచ్చిన కరోనాతోపాటు గత తెలుగుదేశం పార్టీ హాయంలో బడ్జెట్‌కు మించి చేసిన పనులే కారణమని డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు తెలిపారు. ఇంకా నగరంలోని పలు ప్రజా సమస్యలను కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత అధికారుల ద్వారా వివరణ ఇప్పించారు. సమావేశంలో డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, పలు శాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పంచాయతీ చేసిన పనులకు

కార్పొరేషన్ చెల్లింపులు

కౌన్సిల్‌లో ఆమోదించిన కార్పొరేటర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దాదాపు 17 ఏళ్ల కిందట పెళ్లూరులోని ఓ ప్రయివేటు స్థలంలో పంచాయతీ అధికారులు రోడ్డు వేశారు. పెళ్లూరు ఇప్పుడు కార్పొరేషన్ పరిధిలోకి వచ్చింది. అప్పట్లో తమ సొంత స్థలంలో రోడ్డు వేసినందున 0.12 సెంట్లు స్థలాన్ని తాము కోల్పోయామని, ఇప్పుడు దానికి నష్టపరిహారం ఇవ్వాలని స్థల యజమానులు కార్పొరేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అడిగిందే తడవుగా 0.12 సెంట్ల స్థలానికి నష్టపరిహారం ఇచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గం ముందుకు వచ్చింది. ఆ విషయాన్ని శుక్రవారం నాటి కౌన్సిల్ సమావేశంలో పెట్టి ఆమోదించారు. ఈ విషయం మీద అధికార పార్టీ కార్పొరేటర్ చింతపల్లి గోపి, టిడిపి కార్పొరేటర్ అంబూరి శ్రీనివాస్ ప్రశ్నించారు. 17ఏళ్ల నుంచి భూ యజమానులు మిన్నకుండి ఇప్పుడు నష్టపరిహారం ఇవ్వమని అడగం ఏంటని వారు ప్రశ్నించారు. అయితే ఈ విషయాన్ని మిగిలిన సభ్యులు పట్టించుకోలేదు. నష్టపరిహారం ఇచ్చేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ప్రస్తుతం ఆ భూమి విలువ దాదాపు రూ.70 లక్షలు ఉంటుందని సమాచారం. ప్రయివేటు స్థలంలో అప్పట్లో పంచాయతీ అధికారులు రోడ్డు వేయడం ఏంటి...? ఇప్పుడు ఆ సర్వే నెంబర్ కార్పొరేషన్‌లో విలీనం అయ్యింది కాబట్టి కార్పొరేషన్ డబ్బులు చెల్లించడం ఏంటి..? అని అధికార పార్టీ కార్పొరేటర్లు చర్చించుకోవడం కనిపించింది. ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం పరిహారం కింద చెల్లించాలని తీర్మానించడం వెనుక ఎవరి ప్రయోజనం ఎంత? అనే చర్చ కూడా జరిగింది. అయితే ఇదంతా కౌన్సిల్ సమావేశంలో కాకుండా కౌన్సిల్ హాలు నుంచి బయటకు వచ్చిన తరువాత పలువురు కార్పొరేటర్లు చర్చించుకోవడం విశేషం.